
# తెల్లవాళ్ళు



'నివేదిత' మాస పత్రిక . . . ఆగస్ట్, *1979*

"ఈ రోజు మన స్కూల్‌కి ఒక అమెరికా అమ్మాయి వస్తోంది!"

– అంటూ మా క్లాసులో అందరూ చెప్పుకోవడం మొదలుపెట్టారు.

"ఎందుకు? ఎందుకు? ఎవరు వచ్చేది?" అంటూ మా క్లాసుపిల్లలు వాళ్ళలో వాళ్ళు ప్రశ్నించుకోసాగారు.

"ఎవరో మిసెస్ జాన్‌ట!" అని ఒక అమ్మాయి అంది.

"మిసెస్ జానా? ఆమె, ఆమె భర్తా మా ఇంటికి దగ్గరలోనే ఉంటున్నారు!" అంది ఇంకో అమ్మాయి.

"మన ఇండియన్ స్కూల్స్‌లో ఎడ్యుకేషన్ ఎలా వుంటుందో చూడ్డానికి వస్తోందిట!" అంది మరో అమ్మాయి.

ఈ మాటలన్నీ నేను వింటున్నానే కాని, ఆ విషయాన్ని నేను పట్టించుకోలేదు. అందర్నీ ఆకర్షించిన ఆ విషయంలో నాకేమీ ఆసక్తి లేకపోయింది. అందుకు ముఖ్యకారణం పాశ్చాత్యుల పట్ల నాకున్న అభిప్రాయమే!

బ్రిటిష్ వాళ్ళు మన దేశాన్ని కొల్లగొట్టి పాలించారు. ఫ్రెంచివాళ్ళు, స్పెయిన్ వాళ్ళు, డచ్చి వాళ్ళు, పోర్చుగీసు వాళ్ళు, జర్మనీ వాళ్ళు... ఇలా ఎందరో తెల్లవాళ్ళు అనేక దేశాలను జయించి, అక్కడి ప్రజలను బానిసలుగా చేసి, చిత్రహింసల పాలు చేశారు. అమెరికా వాళ్ళు వియత్నాం దేశాన్ని రణరంగంగా మార్చి, అక్కడి ప్రజలకి ఏళ్లతరబడి శాంతి అంటూ లేకుండా చేశారు. ఈ విధంగా తెల్లవాళ్ళందరూ రాజ్యకాంక్ష గలవారే!

అందువల్ల వాళ్ళంటే నాకు అసహ్యం! అటువంటి జాతికి చెందిన ఒక మనిషి వస్తూంటే– అదొక వింతగా చెప్పుకోవడం, ఆమెని చూడాలని అనవసరపు ఆసక్తిని చూపించడం నాకెంతో అసహ్యాన్ని కలిగించింది. అయితే నా భావాలని నేను ఎవరికీ చెప్పలేదు.

మా హెడ్మాస్టర్‌గారు స్కూల్ టీచర్ల నందరినీ పిలిచి 'మిసెస్ జాన్' వస్తున్న విషయం తెలియబరచి, వారి వారి క్లాసులలోని పిల్లల్ని తయారుగా ఉంచమన్నారు. ఆయన ఆదేశం ప్రకారం మా టీచర్లు కొందరు– కొందరు పిల్లల్ని ఎన్నుకుని వాళ్ళని తాము అడగబోయే ప్రశ్నలను ముందుగానే చెప్పి, వాటికి సమ-ధానాలు ఎలా ఉండాలో చెప్పి, ఆ విధంగా రిహార్సల్స్ చేయించారు.

ఆ మధ్యాహ్నం మిసెస్ జాన్ మా స్కూల్‌కి వచ్చింది.

హెడ్మాస్టర్‌గారు ఆమెని వెంటబెట్టుకుని క్లాసులకి తీసుకురాసాగారు. వాళ్ళిద్దరూ మా క్లాసుకి రాగానే, మేమంతా లేచినుంచున్నాం. హెడ్మాస్టరు కూర్చోమన్న తర్వాత అంతా కూర్చున్నాం.

మా టీచర్ నన్ను పిలిచి రెండు ప్రశ్నలడిగారు. అన్నింటికీ నేను ధైర్యంగా సమాధానం ఇచ్చాను. అదిచూసి మా హెడ్మాస్టరుగారి ముఖంలోనూ మా టీచర్ ముఖంలోనూ సంతోషం కనిపించింది.

మిసెస్ జాన్ కూడా సంతోషించినట్లుంది. చిరునవ్వు ముఖంతో "వెరీగుడ్... వెరీగుడ్..." అని మా నాన్నగారి పేరు అడిగింది.

"ఓ... ఆయనా? ఆయన మాకు బాగా తెలుసు. నీ ముఖంలో ఆయన పోలికలున్నాయి. ఆయన అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూంటాడు. ఈసారి ఆయనతో నువ్వు కూడా రా!" అన్నారు ఆవిడ.

నేనేమీ మాట్లాడలేదు.

తర్వాత మిసెస్ జాన్ ఇంకో పిల్లని ఏదో ప్రశ్న అడిగింది. ఆమె ఉచ్చారణ నాకు అర్థంకాలేదు. బహుశా ఆ అమ్మాయికి కూడా అర్థంకాలేదేమో- లేచి నుంచుందే కాని, సమాధానం చెప్పలేదు.

మిసెస్ జాన్ వేసిన ప్రశ్నను మా టీచర్ మళ్ళీ వేశారు. అయినా ఆ పిల్ల సమాధానం చెప్పలేకపోయింది. మా టీచరుకి కోపం వచ్చింది.

"ఇంత చిన్నప్రశ్నకి సమాధానం చెప్పవే? ఎప్పుడూ చెప్పేదానివి- ఈరోజు ఏమైందీ..?" అంటూ టేబుల్ మీదున్న బెత్తం తీసి ఆ పిల్లమీద గట్టిగా ఒకటి అంటించింది.

అంతవరకూ చిరునవ్వుతో ఉన్న మిసెస్ జాన్ ముఖం కోపంతో ఎఱ్ఱబడిపోయింది.

"నో...నో... మీరు పిల్లల్ని కొట్టకూడదు!" అంటూ మా టీచర్ చేతిలోని బెత్తం లాక్కొంది. దానిని బల్లమీద పడేసి ముఖం ముడుచుకుని చకచకా వెళ్ళిపోయింది.

ఏదో సంజాయిషీ చెప్తూ మా హెడ్మాస్టర్ కూడా ఆమె వెనకాలే వెళ్లారు. జరిగినదానికి కొయ్యబారిపోయారు మా టీచర్.

'ఒక పాశ్చాత్య వనితలో ఇంత జాలి కూడా ఉందా? అందులోనూ భారతీయుల మీద?' అని అనిపించింది నాకు.

ఇంటికెళ్లాక ఆరోజు జరిగినదంతా మా నాన్నగారికీ, అమ్మకీ చెప్పాను. మా నాన్నగారు మిసెస్ జాన్‌నీ, ఆమె భర్తనీ బాగా ఎరుగున్నట్లు చెప్పారు.

ఆ తర్వాత ఒకటి రెండుసార్లు మా నాన్నగారితో మిసెస్ జాన్ ఇంటికి వెళ్లాను.

ఆమె నాకు బిస్కట్లు, చాక్లెట్లూ పెట్టి, టీ ఇచ్చేది. ఆమె అడిగినవాటికి సమాధానం చెప్పి ఊరుకునేదానిని.

●

ఆరోజు ఆదివారం!

మా నాన్నగారు ప్రొద్దున్నే 'మిసెస్ జాన్ ఇంటికి వెళ్దాం రమ్మ'ని నన్నూ తీసుకువెళ్లారు.

వాళ్ళ ఇంటి కాంపౌండ్‌లో బట్లర్ కనిపిస్తే- అతన్ని పలకరించారు మా నాన్నగారు. అతను సమాధానం చెప్పి మిసెస్ జాన్, మిస్టర్ జాన్ ఔట్‌హౌస్‌లో ఉన్నారని చెప్పాడు.

మాకు వాళ్ళతో బాగా చనువు ఉండటం వల్ల తిన్నగా ఔట్‌హౌస్ వైపు వెళ్లాం.

మేము దానిని సమీపించేసరికి- లోపలినుంచి 'ధా...'మ్మని తుపాకీ శబ్దం వినిపించింది.

మేము కంగారుగా ఔట్‌హౌస్‌లోకి పరిగెత్తుకెళ్లాం.

అక్కడి దృశ్యం చూసేసరికి మాకు కళ్ళు తిరిగిపోయాయి. నేను భయంతో కెవ్వున కేక వేసి మా నాన్నగారిని గట్టిగా పట్టుకున్నాను.

ఆయన నోట మాటరాక అలాగే నిల్చుండిపోయారు.

ఔట్‌హౌస్ లోని వరండాలో ఒక మంచి బలిసిన ఎద్దు రక్తపు మడుగులో చచ్చిపడి ఉంది. దాని చెవి దగ్గర నుంచి రక్తం చిమ్మనగ్రోవి నుంచి వస్తున్నట్లు వేగంగా వస్తోంది. మిసెస్ జాన్, ఆమె భర్తా పెద్దకత్తులతో ఆ ఎద్దు చర్మాన్ని కోయబోతున్నారు. నా కేక విని వాళ్ళిద్దరూ మావంక చూశారు.

"ఓ... సారీ! ఈరోజు మా ఇంట్లో డిన్నర్ పార్టీ ఉంది. చాలామంది గెస్ట్స్ వస్తారు. అందుకే ఈ ప్రయత్నం..!" అన్నాడు మిస్టర్ జాన్.

"మేము మరోసారి వస్తాం... ప్రత్యేకించి పనేమీ లేదు!" అంటూ మా నాన్నగారు నన్ను తీసుకుని వచ్చేశారు.

అక్కడి దృశ్యం చూసేసరికి నాకు ఆపుకోలేనంత దుఃఖం వచ్చింది. కష్టంమీద ఆపుకున్నాను.

దారిలో- "నాన్నగారూ... తెల్లవాళ్ళు ఇంత క్రూరులా?" అని అడిగాను.

నాన్నగారు- "అది వాళ్ళ అలవాటు!" అని ఊరుకున్నారు.

'పిల్లల్ని కొడ్తుంటే చూడలేని మిసెస్ జాన్‌లో ఇంతటి క్రౌర్యం ఉందా?' అని అనిపించింది నాకు.

ఆరోజు నేను అన్నం కూడా తినలేకపోయాను. కొన్నాళ్ళవరకు నాకు ఆ దృశ్యమే కళ్ళముందు ఉంటూ దిగులుగా ఉండేది. ఆ తర్వాత నేను ఎప్పుడూ మిసెస్ జాన్ ఇంటికి వెళ్లలేదు. మా నాన్నగారు వెళ్లారేమో తెలీదు.

కొన్నాళ్ల తర్వాత మా నాన్నగారు నన్ను స్కూటర్ మీద ఎక్కించుకుని బజారు తీసుకువెళుతున్నారు.

దారిలో మిసెస్ జాన్ ఎదురయింది. ఆమె మమ్మల్ని చూసి చెయ్యెత్తింది.

మా నాన్నగారు స్కూటర్-ఆపి ఆమెను పలకరించారు. నాకు ఆమె అంటేనే అసహ్యంగా వుండి ఆమెవంక చూడలేదు, పలకరించలేదు.

ఆమే - "హౌ ఆర్ యూ బేబీ?" అని అడిగింది.

"ఓ...కే..!" అని ముభావంగా సమాధానం చెప్పాను.

ఇంతలో... ప్రక్కనుంచి ఒక ఎద్దుబండి వస్తోంది. ఆ ఎద్దు బాగా బక్కచిక్కి ఉంది. పైగా- దాని మెడమీద ఎఱ్ఱని పుండు ఉంది. దానిమీదే కాడి ఉంది. అది బండిని లాగలేకపోతోంది. పైగా అక్కడ రోడ్ అప్ మీద వుంది. ఆ ఎద్దు బండిని లాగలేకపోయేసరికి- ఆ బండివాడు కఱ్ఱతో దానిని చావబాదడం మొదలుపెట్టాడు.

ఆ దృశ్యం చూసేసరికి మిసెస్ జాన్ ముఖం కందగడ్డలా ఎఱ్ఱబడింది. ఆమె కళ్ళు చింతనిప్పులయ్యాయి. కోపంతో వణికిపోయింది.

"యూ బ్రూట్... వై ఆర్ యూ టార్చరింగ్ దట్ యానిమల్?" అంటూ బండివాడి మీద విరుచుకుపడింది.

ఆమె అన్నదేమిటో బండివాడికి అర్థంకాలేదు. ఎద్దు కష్టంమీద బండిని లాక్కునిపోయింది.

మిసెస్ జాన్ మా నాన్నగారితో- "సీ... హౌ క్రూయల్ ఈజ్ దట్ రాస్కెల్!" అంది.

మా నాన్నగారు ఏమీ మాట్లాడలేదు. తర్వాత ఒకటి, రెండు మాట్లాడి మిసెస్ జాన్ వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోయాక నేను-

"నాన్నగారూ! వీళ్ళది ఎంత నటన? ఆరోజు దయాదాక్షిణ్యాలు లేకుండా ఎద్దుని కాల్చి చంపారు. ఈరోజు జాలి వొలకబోస్తోంది!" అన్నాను.

మానాన్న- "కాదమ్మా! అక్కడే మనకీ, వాళ్ళకీ తేడా ఉంది. వాళ్ళు జంతువులను కూడా అవి బ్రతికి ఉన్నంతకాలం ప్రేమగా చూస్తారు, బాగా మేపుతారు. అవసరం వచ్చినప్పుడు బాధ లేకుండా చంపుతారు. అందుకనే చెవి దగ్గర తుపాకీతో కాల్చి చంపారు. దేనినీ చిత్రహింస పెట్టరు.

మనం అలా కాదు. ఆవుని 'గోమాత' అని పూజిస్తాం! కాని, గడ్డి కూడా సరిగ్గా పెట్టం. ఎద్దుల్ని సరిగ్గా మేపకుండా చచ్చేపని చేయిస్తాం... వాటిని చిత్రవధ చేస్తాం! బ్రతికినంతకాలం చిత్రవధ చేసే మనకంటే- బ్రతికినంతకాలం బాగా మేపి, బాధ లేకుండా చంపేవాళ్ళే నయం కాదా అమ్మా!" అన్నారు.

నేనేమీ మాట్లాడలేదు. ఆ బండివాడు, బక్కచిక్కిన ఎద్దుని పెట్టిన బాధ చూస్తే... నాన్నగారు చెప్పింది నిజమే ననిపించింది.

*'నివేదిత' మాస పత్రిక . . . ఆగస్ట్, 1979*

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరిపేజీల్లో చూడండి...